క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న తిరుమల సాయి విద్యానికేతన్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులతో వైద్య తనిఖీలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించి, మందులు ఇవ్వనున్నామన్నారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు పాలకొండ విద్యార్థి


అభిషేక్‌కుమార్

పాలకొండ/పాలకొండ రూరల్: పట్టణంలోని కస్పావీధికి చెందిన యామల అభిషేక్ కుమార్ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక య్యాడు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో అనంతపురంలో జరిగిన వాలీ బాల్ స్టేట్ మీట్ స్కూల్ గేమ్స్ పోటీల్లో అండర్ – 17 వాలీబాల్ టోర్నీలో ప్రతిభ కనబరిచాడు. పదో తరగతి వరకు పాలకొండలోని కస్పావీధిలో చదుకున్న అభిషేక్.. ప్రస్తుతం విశాఖపట్నం ఏవీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ సందర్భంగా అభిషేక్‌ను పట్టణ ప్రజలు అభినందించారు.

వాహన తనిఖీలు

కొమరాడ: మండల పరిధిలోని కూనేరు జంక్షన్ సమీపంలో అంతర్‌రాష్ట్ర రహదారిలో ఎస్‌ఐ కె.నీలకంఠం తన సిబ్బందితో కలిసి శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. సారా, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఈ సోదాలు చేస్తున్నామని ఎస్‌ఐ కె.నీలకంఠం తెలిపారు. మత్తు పదార్థాల రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు.

సమయపాలన తప్పనిసరి

వీరఘట్టం: విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ బి.వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పరిరక్షణ, పీజీఆర్ఎస్ గ్రీవెన్స్ పరిష్కారాలు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

సీతంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) స్టడీ మెటీరియల్‌ను శనివారం పంపిణీ చేశారు. యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో సమాజ్ పరివర్తన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నరేష్ మెటీరియల్‌ను అందజేశారు. సంస్థ ప్రతినిధులు బి.చంద్రరావు, హిమగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా శనివారం చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సమాజాన్ని చైతన్యం చేసే నాటికల ప్రదర్శనతో పాటు విద్యార్థులు చేసిన సంప్రదాయ, జానపద నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

వీరఘట్టం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాల సందర్భంగా శనివారం స్థానిక మహర్షి హైస్కూల్ విద్యార్థులకు పోలీస్ యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్ నమోదు, స్టేషన్‌లో రికార్డుల మెయింటెనెన్స్, రిసెప్షన్, తదితర అంశాలను వివరించారు. అలాగే సమాజంలో శాంతి, భద్రతల పరిరక్షణకు పోలీసులు చేపడుతున్న విధి, విధానాలను వివరించారు.

విద్యా సామర్థ్యాల పరిశీలన

సీతంపేట: మండలంలోని సామరెల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ఏఎంఓ పి. కోటిబాబు శనివారం సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. వివిధ సబ్జెక్ట్‌లకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల నోటు పుస్తకాలు చూశారు. ఎస్ఏ –2 పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

సందర్శన

సీతంపేట: మండలంలోని పూతికవలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సామర్థ్యాలను అంచనా వేశారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. వాటర్‌ప్లాంట్, స్టోర్ రూమ్ రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

సక్రమంగా సరుకుల పంపిణీ

భామిని: రానున్న నెలలో నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీ శంకరరాయుడు ఆధ్వర్యంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దీపావళి సందర్భంగా ప్రభుత్వం మంజూరు చేసిన సరుకులను లబ్ధిదారులకు అందజేయాలన్నారు.

కుక్కలు బాబోయ్.. కుక్కలు..

- పట్టణంలో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న శునకాలు
- కనబడిన వారందరిపై దాడి
- హడలిపోతున్న ప్రజలు


పట్టణ ప్రధాన రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

పాలకొండ రూరల్:

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ జనంపై దాడికి దిగుతున్నాయి. పాదచారులు, వాహనచోదకులే లక్ష్యంగా దాడికి యత్నిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణ పరిధిలోని 20 వార్డుల్లో ఎక్కడబడితే అక్కడ గుంపులుగా దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా సంతమార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో పదుల సంఖ్యలో తిరుగుతూ కనబడిన వారిని కరుస్తున్నాయి. ఇటీవల పట్టణంలోని కొత్తవీధిలో దేవరపేటలో పాఠశాల నుంచి తిరిగి వస్తున్న చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. ఆ సమయంలో స్థానికులు స్పందించడంతో పిల్లలు క్షేమంగా బయటపడ్డారు. ఈ సమస్య పట్టణానికే పరిమితం కాలేదని.. మండలంలోని అన్ని పంచాయతీల్లో చోటు చేసుకుందని ప్రజలు వాపోతున్నారు.

నిర్లక్ష్యం చేస్తే.....

పట్టణంలో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారులు, మాంసం, చేపల దుకాణాల వద్ద వీటి సంచారం ఎక్కువగా ఉంది. కుక్క కరిచిన వెంటనే వైద్యం పొందాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. సకాలంలో వైద్యం అందకపోతే రేబిస్ వ్యాధి సోకుతుందని హెచ్చరిస్తున్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో రాత్రిపూట గుంపులుగా సేదతీరుతున్న కుక్కలు

నివారణకు చర్యలు తీసుకుంటాం..



పట్టణంలో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉందనే విషయం మా దృష్టికి వచ్చింది. వీధి కుక్కల నియంత్రణలో భాగంగా సంతానోత్పత్తి లేకుండా ఆపరేషన్లు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలిపెట్టేందుకు అవసరమైన చర్యలపై దృష్టి సారిస్తాం.

– ఎస్.సర్వేశ్వరరావు, నగర కమిషనర్, పాలకొండ

బయటకు వెళ్లాలంటే భయం..



పట్టణంలో కుక్కల సంచారం అధికంగా ఉంది. బయటకు వెళ్లాలంటేనే భయంగా ఉంటోంది. ప్రధాన మార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో, కార్గిల్ కూడలి, తదితర జంక్షన్లలో పదుల సంఖ్యలో కుక్కలు హల్‌చల్ చేస్తున్నాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– ఎస్.రామ్మూర్తి, కూరగాయల రైతు, పాలకొండ మండలం

రేబిస్ వ్యాధి లక్షణాలు ఇలా.....

- జ్వరం, తలనొప్పి, విరేచనాలు, వాంతులవుతాయి.
- కాళ్లు, చేతులు పడిపోవడం (పక్షవాతం), ఫిట్స్ రావడం, పిచ్చిపిచ్చిగా మాట్లాడటం వంటి లక్షణాలు తలెత్తుతాయి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- కుక్క కరవగానే వీలైనంత త్వరగా కుళాయి కింద గాని లేదా మగ్గుతో నీళ్లు పోస్తూ గాయమైన భాగాన్ని సబ్బుతో కనీసం 15 నిమిషాలు శుభ్రంగా కడగాలి.
- గాయానికి ఎలాంటి కట్టూ కట్టకూడదు.
- కుక్క కాటుకు ఆహార నియమాలు ఏమీ లేవు.
- కరిసిన కుక్కను పది రోజుల పాటు గమనించాల్సి ఉంటుంది. కుక్క ఆరోగ్యంగా ఉంటే గాయపడిన వారు భయపడనక్కర్లేదు.
- వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలి. గాయానికి ఎప్పటికప్పుడు డ్రెస్సింగ్ చేయించాలి. ఏఆర్వీ వ్యాక్సిన్ 0, 03, 07, 14 రోజుల్లో ఒక డోస్ చొప్పున తీసుకోవాలి.

ఈ నెల జీతం అందేటట్టు లేదు..

- గందరగోళంగా సచివాలయ సిబ్బంది బదిలీలు
- ఇంతవరకు అందని రిలీవింగ్ ఆర్డర్లు

పాలకొండ : మండలంలోని సచివాలయ ఉద్యోగులకు ఈ నెల జీతాలు అందే పరిస్థితి కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వంలో చేపట్టిన బదిలీలు గందరగోళంగా మారడంతో సచివాలయ ఉద్యోగులకు జీతాల బిల్లులు పెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. ఉద్యోగులకు సాధారణంగా ప్రతి నెలా 25వ తేదీ లోపు జీతాల బిల్లులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మండలంలో సచివాలయ ఉద్యోగుల బదిలీలు ఈ నెల 3తో ముగిశాయి. రిలీవింగ్ ఆర్డర్లు మాత్రం ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. సచివాలయం పరిధిలో పంచాయతీ కార్యదర్శులే డీడీఓలు కావడంతో ప్రస్తుతం బిల్లులు పెట్టే అవకాశం లేకుండా పోయింది. రిలీవింగ్ ఆర్డర్లు ఈ నెల 4వ తేదీతో ఇవ్వాల్సి ఉంది. అయితే ఇంతవరకు మండలంలోని సచివాలయ ఉద్యోగులను రిలీవ్ చేయలేదు. దీంతో ఇంతవరకు పనిచేసే చోట జీతాలు పెట్టుకునే అవకాశం లేదు. ప్రస్తుతం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీలు జరిగాయి. వెటర్నరీ, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బదిలీలు జరగకపోయినా.. బదిలీ అయిన వారికి రిలీవింగ్ ఆర్డర్లు ఇవ్వకపోవడంతో వీరికి కూడా జీతాలు నిలిచిపోనున్నాయి. మండల వ్యాప్తంగా సుమారుగా 270 మంది సచివాలయ ఉద్యోగులకు ఈ నెల జీతాలు అందే పరిస్థితి లేదు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచండి


సూచనలిస్తున్న ఎంఈవో గౌరునాయుడు

జియ్యమ్మవలస: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని, ఆ దిశగా ప్రధానోపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో–1 గౌరునాయుడు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశమైన ఆయన.. సిబ్బంది సమయపాలన పాటించి, విద్యార్థులకు చక్కగా చదువు చెప్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు తప్పనిసరిగా చతుర్విధ ప్రక్రియలు వచ్చేలా చూడాలని, విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలు పెంచేలా విద్యాబోధన చేయాలన్నారు. అలాగే నాణ్యమైన భోజనం వారికి అందించాలని తెలిపారు. బడితోట పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశాల బోధన జరగాలని, టీచర్ డైరీని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఎంఈవో–2 శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతినెలా సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, ఉపాధ్యాయుల హాజరును సమయానికి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

డీఈఓకు అభినందనలు


డీఈఓ తిరుపతినాయుడికి అభినందనలు తెలుపుతున్న ఎంఈఓ అప్పలనాయుడు

గరుగుబిల్లి: పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలను స్వీకరించిన నల్ల తిరుపతినాయుడికి గరుగుబిల్లి మండల విద్యాశాఖ సిబ్బంది శనివారం పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఎంఈఓ దత్తి అప్పలనాయుడు, ఎంఈఓ–2 కొండలరావుతోపాటు సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


శివ్వాంలో కొత్తగా నిర్మించిన రక్షణ గోడను పరిశీలిస్తున్న డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డ్వామా పీడీ కె.రామచంద్రరావు సూచించారు. మండలంలోని శివ్వాం గ్రామంలో సీసీ రోడ్డు, రక్షణ గోడ నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, జిల్లాలోని 15 మండలాల్లో అభివృద్ధి పనులకు అవసరమైన ప్రతిపాదనలు పంపించడం, నిధుల మంజూరు జరుగుతోందన్నారు. నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కురుపాం నియోజకవర్గంలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో 16 పనులకు గాను రూ.18.17 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. శివ్వాం గ్రామ శివాలయానికి ఆనుకుని ఉన్న రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరైందన్నారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దని, సకాలంలో పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అధికారి గౌరీశంకరరావు, కార్యదర్శి బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్సతో పాటు పర్యవేక్షణ తప్పనిసరి


నెల్లికిక్కువ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఐవో నారాయణ

గుమ్మలక్ష్మీపురం: శ్వాస సంబంధ సమస్యలు, జ్వరం వంటి వాటి బారినపడిన పిల్లలకు చికిత్స అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని డీఐవో(జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి) ఎం.నారాయణ సూచించారు. మండలంలోని రేగిడి, దుడ్డుఖల్లు గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు నెల్లికిక్కువ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. అక్కడి రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, పిల్లలు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లలకు సకాలంలో టీకాలు వేయాలని తెలిపారు. అలాగే ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలుషిత నీరు, ఆహారం వల్లే వ్యాధులు ప్రబలుతున్నాయని, ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు ప్రతాప్‌కుమార్, ప్రవీన్‌కుమార్, ఐసీడీఎస్ పీవో సీహెచ్ సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్‌బాబు


గెలుపొందిన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్ శ్యామ్‌బాబు

పాలకొండ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యామ్‌బాబు అన్నారు. ఇటీవల కళాశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అంబేడ్కర్ యూనివర్సిటీ నేతృత్వంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కబడ్డీలో పాలకొండ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో.. బాలికల విభాగంలో సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. రానున్న రోజుల్లో క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, వర్సిటీ క్రీడాబోర్డు కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, క్రీడా కోఆర్డినేటర్ బి.రాజు, వ్యాయామోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు ఎస్.సీతారామ్, రామకృష్ణ, వి.పుష్పనాథం, ఆర్.రాములు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేటలో ఓపెన్‌హౌస్


పోలీస్ విధులపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై సంజీవరావు

సీతంపేట: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై అమ్మన్నరావు తెలిపారు. స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలకు చెందిన విద్యార్థులకు ఆయుధాలు, కమ్యూనికేషన్ బాంబ్ డిటెక్షన్, బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం శనివారం నిర్వహించి, పోలీస్ ఆయుధ సామగ్రి వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులంతా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉత్తమ పౌరులుగా జీవించాలని సీఐ ఎస్.గోవిందరావు కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఆయుధాల ప్రదర్శన

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట, కురుపాం మండల పోలీస్‌స్టేషన్ల వద్ద పోలీసుల ఆయుధాల ప్రదర్శన శనివారం చేపట్టారు. పోలీసులు తమ విధి నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు వాడే ఆయుధాలు, సామగ్రిని ప్రదర్శించి, వాటి ఉపయోగాలు, వాడే విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి, ఏటా విధి నిర్వహణలో ప్రాణాలు త్యజించిన పోలీసుల త్యాగాలు స్మరించుకుని, ఇలా ఆయుధ సామగ్రి ప్రదర్శిస్తుండడం జరుగుతోందని ఎల్విన్‌పేట, కురుపాం ఎస్ఐలు బి.శివప్రసాద్, పి.నారాయణరావు తెలిపారు.

గరుగుబిల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి, పోలీసులు తమ విధుల్లో వాడే ఆయుధాలను ప్రదర్శించి, వాటి వినియోగంపై ఎస్ఐ పి.రమేష్‌నాయుడు అవగాహన కల్పించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించి, రికార్డులు, పోలీస్ శాఖ ఉపయోగించే టెక్నాలజీ, క్లూస్ టీమ్ పనితీరు, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డాగ్ స్క్వాడ్ వంటి అంశాల గూర్చి తెలియజేశారు.

అధికారులూ.. హద్దులు మీరొద్దు..

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


ఎమ్మెల్సీ విక్రాంత్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ శాంతికుమారి, తదితరులు

భామిని: అధికారులు హద్దులు మీరొద్దని.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే భవిష్యత్ సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఎంపీపీ తోట శాంతికుమారి అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో పల్లె పండుగ పేరిట చేపట్టిన శంకుస్థాపన కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులను ఎందుకు ఆహ్వానించడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను ప్రశ్నించారు. సర్పంచ్‌కు తెలియకుండా పనులు ప్రారంభిస్తే పంచాయతీ ఆమోదం ఎలా లభిస్తుందని బత్తిలి ఎంపీటీసీ సభ్యుడు టింగ అన్నాజీరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. అత్తికొత్తూరులో చేపడుతున్న ఉపాధి పనులు నిలిపివేసి.. ఎమ్మెల్యేచే కొత్తగా పనులకు భూమిపూజ చేయించారని సర్పంచ్ ఎరుకుమజ్జి ప్రభావతి తెలిపారు. వెంటనే ఎమ్మెల్సీ విక్రాంత్ కలుగజేసుకుని రాజ్యాంగానికి విరుద్ధంగా వెండర్స్ పేరిట పనులు చేయడం తగదన్నారు. సర్పంచ్‌ల ఆమోదం లేకుండా పనులు చేయిస్తే అధికారులు చిక్కుల్లో పడతారని గుర్తు చేశారు. సమావేశాలకు మహిళా ప్రజా ప్రతినిధులు రాకుండా వారి ప్రతినిధులు హాజరై రాద్ధాంతం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు మజ్జి మోహన్‌బాబు, వైస్ ఎంపీపీ బి. ధర్మారావు, ఎంపీటీసీ సభ్యులు పత్తిక మురళి, బూస బాలకృష్ణ, కొత్తకోటల చంద్రశేఖర్, పాలక ఉషారాణి, పాత్రుకొండ రాంబాబు, ఏఎంఓ కె.సింహాచలం, ఈసీ రమణమూర్తి, వైద్యులు పసుపులేటి సోయల్, దీపికారాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి సత్కారం..

మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను ఎంపీపీ తోట శాంతికుమారి, వైస్ ఎంపీపీ బి. ధర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తోట సింహాచలం, కొవ్వాడ చిరంజీవులు, తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా మండల సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

నవంబర్ 3న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

పాలకొండ రూరల్: వచ్చే నెల మూడో తేదీన జరగనున్న యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మురళీమోహనరావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను శనివారం సందర్శించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడంతో పాటు పలు సందేహాలను నివృత్తి చేశారు. ఆయనతో పాటు యూటీఎఫ్ నాయకులున్నారు.

సర్టిఫికెట్ల అందజేత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ఆర్ఐటీఐలో 2023–24, 2022–24 బ్యాచ్‌ల విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ గౌరీశంకరరావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఐటీఐ విద్య పూర్తి చేసి అలాగే ఉండిపోకుండా అప్రెంటీస్ పూర్తి చేయాలని తద్వారా మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన సలహా ఇచ్చారు. ఐటీఐ పూర్తి చేసిన వారికి ఎన్నో పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

అట్రాసిటీ కేసుపై విచారణ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ రాంబాబు

జియ్యమ్మవలస: మండల పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 21వ తేదీన నమోదైన అట్రాసిటీ కేసుపై పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు శనివారం విచారణ చేపట్టారు. సంఘటన స్థలానికి వెళ్లి, చుట్టుపక్కల వారిని ఆరోజు జరిగిన ఘటనపై ఆరాతీసి కొంత సమాచారం సేకరించారు. ఆయన మాట్లాడుతూ గడసింగుపురం గ్రామానికి చెందిన గరుగుబిల్లి అలీసా, చింతాడ మధు, నాగళ్ల బుజ్జిలు ఈ నెల 21వ తేదీ సాయంత్రం జియ్యమ్మవలస బస్టాండ్ వద్దకు స్నాక్స్ తినడానికి వెళ్లగా, అక్కడే ఉన్న జియ్యమ్మవలసకు చెందిన మణిభూషణరావు వారితో గొడవ పడ్డాడని, అదే సమయంలో అక్కడికి వచ్చిన దత్తి చంద్రమౌళి, ఆయన కొడుకు దత్తి సతీష్‌లు కూడా అలీసా, మధు, బుజ్జిలను కులం పేరుతో దూషించి దాడికి ఎగబడినట్లు ఫిర్యాదు అందిందన్నారు. అలాగే ఫిర్యాదు చేసిన ముగ్గురూ తమ ఇంటికి వచ్చి నానా హంగామా చేశారని దత్తి చంద్రమౌళి కుమార్తె దత్తి సంతోషి కూడా ఫిర్యాదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఒకరిపై మరొకరు చేసుకున్న ఫిర్యాదుల మేరకు సంఘటన స్థలానికి వెళ్లి, విచారణ చేపట్టామని, తుది నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ సీఐ దొర, ఎస్ఐ అనీష్ పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి


మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

జియ్యమ్మవలస: మందుగుండు సామగ్రి అమ్మకానికి అనుమతులు తప్పనిసరి అని పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. దీపావళి పురస్కరించుకుని, టపాసుల విక్రయాలు జరిగే అవకాశం ఉన్నందున స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మందుగుండు సామగ్రి అక్రమంగా విక్రయించడం గానీ, నిల్వ చేయడం గానీ నేరమని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మందుగుండు సామగ్రి విక్రయించాలనుకునే వారు సబ్‌కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని, 24 గంటల్లోగా తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎస్ఐ పి.అనీష్ ఉన్నారు.

గోనెల వివరాలు తెలియజేయండి


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: గత ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం మిల్లర్లకు ఇచ్చిన గోనెల వివరాలను తెలియజేయాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మిల్లర్లు, ఆయా మిల్లులకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు సమయానికి మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీలు, ఇతర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం వీఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సర్వే డీటీ బి.ప్రసాదరావు, ఆర్ఐ లక్ష్మంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. అధ్యక్షుడిగా రెడ్డి రామ్‌ప్రసాద్‌నాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎల్.గణపతి, జనరల్ సెక్రటరీగా తలగాపు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు తమవంతు కృషి చేస్తామని వారు అన్నారు.